సాక్షి నల్లగొండ

ఆదివారం । 7 । జనవరి । 2024



జగదీష్‌రెడ్డే.. 420
రాష్ట్ర మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డే అసలు 420 అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. - 8లో



ఏసీబీ సోదాలు
నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రాత్రి 9 గంటల వరకు ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. - 8లో



శ్రీవారి సేవలో డిప్యూటీ సీఎం
డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క శనివారం బరాఖత్‌గూడెంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. - 10లో

న్యూస్‌రీల్

అవిశ్వాస తీర్మానంపై హైకోర్టు స్టే

- నందికొండ మున్సిపాలిటీ సమావేశం రద్దు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానంపై హైకోర్టు స్టే విధించింది. దీంతో శనివారం అవిశ్వాస తీర్మానం కోసం నిర్వహించాల్సిన మున్సిపల్ సమావేశం రద్దయింది. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు గతేడాది డిసెంబర్‌లో, అంతకు ముందు ఒకసారి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కలెక్టర్‌కు నోటీసులు అందజేశారు. కాగా, జనవరి 6వ తేదీన మున్సిపల్ ప్రత్యేక సమావేశానికి హాజరుకావాలని కలెక్టర్ ఇటీవల కౌన్సిలర్లకు నోటీసులు అందజేశారు. ఈ సమావేశానికి మిర్యాలగూడ ఆర్డీఓ హాజరు కావాలని కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. అయితే 5వ తేదీ సాయంత్రం తెలంగాణ హైకోర్టు నుంచి స్టే వచ్చింది. ఆ ఆర్డర్‌ను అధికారులకు అందజేశారు. దీంతో సమావేశం రద్దయింది.

ఆకట్టుకున్న ఇన్నోవేటివ్ ఎక్స్‌పో



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ దుర్గసుకుమార్

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని దేశ్‌ముఖి గ్రామ పరిధిలోని విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇన్నోవేటివ్ ఎక్స్‌పో–2024 ఆకట్టుకుంది. ఆయా విభాగాలకు చెందిన విద్యార్థులు 488 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇందులో సైబర్ భద్రత, సౌరశక్తి, బ్యాటరీ టెక్నాలజీ, ఆటోమేషన్ తదితర ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. న్యాయ నిర్ణేతలుగా డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు వ్యవహరించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ సంస్థల సీఈఓ బోయపాటి శ్రవణ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దుర్గసుకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలను వెలికితీయడానికి ప్రతి సెమిస్టర్‌లో ఇన్నోవేటివ్ ఎక్స్‌పోలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విద్యార్థుల్లో ఆధునిక సాంకేతిక లక్ష్యాలను పెంపొందించడానికి ఎక్స్‌పోలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించేందుకు నిరంతరం శ్రమించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణ

చౌటుప్పల్ : గ్రూప్–1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా బీసీ ఉపాధి నైపుణ్య శిక్షణ కేంద్రం సంచాలకులు కొప్పు విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీలతో పాటు ఈబీసీ అభ్యర్థులు ఈనెల 8నుంచి 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజర్వేషన్, డిగ్రీ మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.5లక్షలకు మించకుండా ఉండాలని, గతంలో శిక్షణ పొందని అభ్యర్థులే అర్హులన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కుల మెమోలు, కుల, ఆదాయ ధ్రువీకరణ, పాస్‌ఫొటోలు, ఆధార్ కార్డు, టీఎస్‌పీఎస్సీ ఓటీఆర్ అప్లికేషన్ ఫాం స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు నల్లగొండలోని కార్యాలయంలో లేదా ఫోన్ నంబర్ 08682–220007ను సంప్రదించాలన్నారు. అర్హత, ఆసక్తి కలిగినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐదుగురు బాల కార్మికులకు విముక్తి

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండలంలో కాటన్ మిల్లు, పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న ఐదుగురు బాల కార్మికులను ఆపరేషన్ స్మైల్ టీం శనివారం పోలీసులకు అప్పగించింది. ఎస్‌ఐ పి.శంకరయ్య నేతృత్వంలో శనివారం తిప్పర్తి మండలంలోని రామలింగాలగూడెం సత్యనారాయణ కాటన్ మిల్లులో, తిప్పర్తి మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో తనిఖీలు నిర్వహించారు. కాటన్ మిల్లులో బీహార్‌కు చెందిన నలుగురు, పెట్రోల్ బంకులో ఒక బాల కార్మికుడిని గుర్తించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ స్మైల్ ఎస్‌ఐ పి.శంకరయ్య మాట్లాడుతూ ఐదుగురు బాల కార్మికులను తిప్పర్తి స్టేషన్‌లో అప్పగించి, కాటన్ మిల్లు నిర్వాహకులు గంజి శ్రీనివాస్, శివరామ్, బంకు నిర్వాహకుడు సతీష్‌పై చర్యల నిమిత్తం ఫిర్యాదు చేశామన్నారు. తనిఖీల్లో సిబ్బంది నాగేశ్వరావు, సతీష్, నాగరాణి, అంజలి తదితరులు ఉన్నారు.

అభయ హస్తం దరఖాస్తులు 6,11,853

ముగిసిన ప్రజాపాలన గ్రామ, వార్డు సభలు

- 1,026 గ్రామ, వార్డుల్లో ఆరు గ్యారంటీలకు భారీగా దరఖాస్తులు
- మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో దరఖాస్తుల ఆన్‌లైన్
- ఈ నెల 17వ తేదీలోగా పూర్తి చేసేలా కార్యాచరణ
- ఆన్‌లైన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు



నల్లగొండలో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు

నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన అభయహస్తం పథకాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. గత నెల 28వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ ఈ నెల 6వ తేదీ వరకు కొనసాగింది. సెలవు దినాలు మినహాయించి ఎనిమిది రోజుల పాటు ప్రజాపాలన గ్రామ, వార్డు సభల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరించారు. ఈ ఎనిమిది రోజుల్లో ఆరు గ్యారంటీలతో పాటు రేషన్‌కార్డులు తదితర వాటికి సంబంధించి జిల్లాలో మొత్తం 6,11,853 దరఖాస్తులు వచ్చాయి.

గ్రామాలు, మున్సిపాలిటీల్లో వేర్వేరుగా..

ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, మున్సిపాలిటీల్లో వేర్వేరుగా దరఖాస్తులను స్వీకరించారు. గ్రామాలకు సంబంధించి ఎంపీడీఓలు, తహసీల్దార్లు రెండు బృందాలుగా ఏర్పడి గ్రామ సభలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శితో పాటు ఐకేపీ సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్ల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. మున్సిపాలిటీల్లో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మెప్మా సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది వార్డు సభల్లో దరఖాస్తులను స్వీకరించారు.

ఆన్‌లైన్ ప్రక్రియ షురూ

ప్రజాపాలన అభయహస్తం ఆరు గ్యారంటీలతోపాటు రేషన్ కార్డుల దరఖాస్తులకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ శనివారంతో ముగిసింది. అయితే శుక్రవారం నుంచే దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైంది. 17వ తేదీలోగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. మండలం యూనిట్‌గా తీసుకుని గ్రామాల నుంచి వచ్చిన దరఖాస్తులను మండల కేంద్రాల్లో కంప్యూటర్ ఆపరేటర్ల చేత ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇందు కోసం 780 మంది ఆపరేటర్లను నియమించారు. 31 మండలాలతో పాటు అన్ని మున్సిపాలిటీల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

పకడ్బందీగా నమోదు..

పజాపాలనలో వచ్చినదరఖాస్తులన్నింటిని http://prajapalana.telangana.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. ఆర్డీఓలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఐకేపీ, మెప్మా సిబ్బంది ఆధ్వర్యంలో కంప్యూటర్ ఆపరేటర్లు దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. రోజూ ఒక్కో ఆపరేటర్ వంద చొప్పున దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. ఎలాంటి తప్పులకు తావు లేకుండా దరఖాస్తులో ఉన్న 27 అంశాలను పథకాల వారీగా నమోదు చేస్తున్నారు. దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి కాగానే సంబంధిత దరఖాస్తుదారుడికి ఎస్‌ఎంఎస్ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో రోజు వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలు

తేదీ	గ్రామ/వార్డు సభలు	దరఖాస్తులు
28.12.23	147	38,760
29.12.23	145	38,858
30.12.23	140	78,550
2.1.24	150	93,276
3.1.24	139	86,104
4.1.24	126	90,462
5.1.24	106	78,873
6.1.24	73	1,06,970
మొత్తం	1,026	6,11,853



నల్లగొండ మండలం చెన్నారంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

తప్పిదాలకు అవకాశం ఉండొద్దు



అభయహస్తం దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే సందర్భంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలి. ఎంపీడీఓలు, ఆర్డీఓలు సంబంధిత సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ఈ నెల 17లోగా దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేయాలి. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలి.

– హేమంత్ కేశవ్‌పాటిల్, ఇన్‌చార్జి కలెక్టర్

ఆదివాసీల అభివృద్ధికి 'పీఎం–జన్‌మన్'

- ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నల్లగొండ : ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం–జన్‌మన్) కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ చెంచు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి వారి అభివృద్ధి బాటలు వేయనుందని ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీఎం–జన్‌మన్ కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకం అమలులో భాగంగా పక్కా గృహాల మంజూరు, అనుసంధాన రోడ్లు, నల్లాల ద్వారా నీటి సరఫరా, హాస్టళ్ల నిర్మాణం, సంచార మెడికల్ వైద్య సేవలు, పోషకాహారం, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, ఉన్నత జీవన ప్రమాణాలు, మారుమూల ప్రాంతాలకు టెలిఫోన్ వసతి వంటి సౌకర్యాలు ఆదివాసీ, చెంచులకు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పెద్దవూర, చందంపేట, గుండ్లపల్లి, నేరెడుగొమ్ము మండలాల పరిధిలోని నెల్లికల్, చింత్రియాల, గోనబోయినపల్లె, కంబాలపల్లి, రేకుల వలయం, పొగిళ్ల, తిమ్మాపూర్, గన్నేరులపల్లి గ్రామపంచాయతీల్లోని చెంచు జనాభాకు ఈ కార్యక్రమాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసీలకు ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, కుల ధ్రువీకరణ పత్రం, జన్ దన్ బ్యాంకు అకౌంట్ తీయించాలని సూచించారు. కిసాన్ క్రెడిట్, పీఎం క్రెడిట్, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి తదితర వాటిని ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు నివేదికలతో సిద్ధంగా ఉండాలి

నల్లగొండ : కేంద్ర సామాజిక న్యాయం, సాధికారికత మంత్రిత్వ శాఖకు సంబంధించి జాతీయ సఫాయి కర్మచారిల కమిషన్ సభ్యుడు పిపి.వవా నిర్వహించే సమావేశాలకు అధికారులు అన్ని నివేదికలతో సిద్ధంగా ఉండాలని ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. సఫాయి కర్మచారిల జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ పిపి.వవా ఆదివారం జిల్లాకు రానున్నారని, ఆయన పర్యటనకు ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని నల్లగొండ ఆర్డీఓను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించే సమావేశానికి జిల్లా అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీఓలు రవి, చెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నీలగిరికి ఉత్తమ ర్యాంక్

- బహిరంగ మల మూత్ర విసర్జన రహిత పట్టణంగా గుర్తింపు
- ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ ర్యాంకు కేటాయింపు



నల్లగొండ మున్సిపల్ కార్యాలయం

నల్లగొండ టూటౌన్ : కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో నీలగిరి మున్సిపాలిటీకి చోటు దక్కింది. నీలగిరి మున్సిపాలిటీకి ఈసారి ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ ర్యాంకు లభించింది. నీలగిరి బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణంగా గుర్తింపు పొందింది. పట్టణంలోని ప్రధాన రహదారులతోపాటు వివిధ ప్రధాన కూడళ్లలో ప్రజా మరుగుదొడ్లను నిర్మించారు. అదేవిధంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక దృష్టి పెట్టి అందరి చేత మరుగుదొడ్ల నిర్మాణం చేయించారు. దాంతో నీలగిరి బహిరంగ మలమూత్ర విసర్జన పట్టణంగా ఎంపిక అయ్యేందుకు దోహదపడింది.

పట్టణంలో మెరుగైన వసతులు

ప్రతి సంవత్సరం పారిశుద్ధ్యం, బహిరంగ మల మూత్ర విసర్జనపై కేంద్రం సర్వే నిర్వహిస్తుంది. నాలుగైదేళ్లుగా ప్రతి సంవత్సరం ఆయా విభాగాల్లో నీలగిరి పట్టణంలో వసతులు మెరుగు పరుస్తుండడంతో మున్సిపాలిటీ ర్యాంకు పెరుగుతూ వచ్చింది. ఈసారి ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ ర్యాంకు దక్కింది.

పరిశుభ్రతతోనే ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ ర్యాంకు



పట్టణంలోని ప్రజా మరుగుదొడ్ల నిర్వహణలో పరిశుభ్రత పాటించడంతోనే మున్సిపాలిటీకి ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ ర్యాంకు దక్కింది. మున్సిపల్ శానిటేషన్ విభాగం ఉద్యోగులు కార్మికులు అందరి సమన్వయంతోనే ఇది సాధ్యమైంది.

– కందుకూరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, నల్లగొండ

హాలియాకు ఓడీఎఫ్ ప్లస్..

హాలియా : బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణంగా హాలియా మున్సిపాలిటీకి ఓడీఎఫ్ ప్లస్ గుర్తింపు లభించిందని మున్సిపల్ కమిషనర్ కందిమళ్ల వీరారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా హాలియా మున్సిపాలిటీలో పబ్లిక్, కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్వాహణపై నిర్వహించిన సర్వేలో హాలియా మున్సిపాలిటీకి చోటు దక్కడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

'మిర్యాల' మున్సిపాలిటీకి ఓడీఎఫ్ ప్లస్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీకి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కేంద్ర బృందం నిర్వహించిన సర్వేలో ఓడీఎఫ్ ప్లస్ గుర్తింపు వచ్చింది. ఇంకా జీఎఫ్‌సీ, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వచ్చిన మార్కులను బట్టి జాతీయ స్థాయిలో ర్యాంకులను ప్రకటించనున్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ చందనాదీప్తి



నల్లగొండ క్రైం : మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ చందనాదీప్తి శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మహిళల రక్షణ కోసం షీటీమ్ పోలీసు బృందాలు ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో నిఘా పెడతాయని తెలిపారు. డయల్ 100 ద్వారా, పోలీస్ శాఖ విడుదల చేసిన క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా, వాట్సాప్ లాంటి మాధ్యమాల ద్వారా మహిళలు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. బాల్య వివాహాలు, భ్రూణహత్యలు, చిన్న పిల్లల అమ్మకాలు, లింగ నిర్ధారణ పరీక్షలు, బాలికలపై లైంగిక వేధింపులు, గంజాయి మత్తు పదార్థాల సమాచారాన్ని పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని కోరారు. సామాజిక మాధ్యమాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాధిత మహిళలు ఎస్పీ చందనా దీప్తి (87126 70200), షీటీమ్ నల్లగొండ (8712670235), షీటీమ్ సీఐ (8712596748), మిర్యాలగూడ ఎస్‌ఐ (8096004465) ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

మహిళా సాధికారత



నల్లగొండలోని చర్లపల్లి గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీలో ఓ విద్యార్థిని వేసిన ముగ్గు

క్యాంపులో నీలగిరి మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్లు

నల్లగొండ : నల్లగొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లారు. ప్రస్తుత బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ నెల 8న సైదిరెడ్డిపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి సమావేశం ఉండడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లనునా పార్టీ క్యాంపునకు తరలించింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లతోపాటు బీఆర్‌ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన వారిని కలుపుకుని అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు 34 మంది కౌన్సిలర్ల బలం ఇప్పుడు కాంగ్రెస్‌కు ఉంది. అయినా.. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత సూచన మేరకు కౌన్సిలర్లను హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని రిసార్ట్‌లకు తరలించినట్లుగా తెలుస్తోంది. క్యాంపు నుంచి నేరుగా ఈ నెల 8వ తేదీన నేరుగా అవిశ్వాస తీర్మాన సమావేశానికి కౌన్సిలర్లు హాజరు కానున్నారని తెలిసింది.

గోదాదేవికి విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం గోదాదేవికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గోదాదేవి అమ్మవారు, శ్రీరంగనాథుడిని కొలుస్తూ పాశురాలను ఆచార్యులు పఠించారు. అమ్మవారికి ఇష్టమైన కట్టెపొంగళిని ఆరగింపుగా సమర్పించారు. అమ్మవారికి మహిళలు మంగళ హారతులు పట్టారు.

పత్తి రైతు దగా..

- తెల్ల బంగారానికి దక్కని మద్దతు ధర
- రైతుల పత్తికి కొర్రీలు పెడుతున్న సీసీఐ కేంద్రాల నిర్వాహకులు
- దళారులు తెచ్చిన పత్తికి మాత్రం మద్దతు ధర చెల్లించి కొనుగోలు
- కేంద్రాల నిర్వాహకుల తీరుతో నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని మార్కెటింగ్ అధికారులు



మునుగోడులో రైతుల వద్ద కొనుగోలు చేసిన పత్తిని లారీలో లోడ్ చేస్తున్న వ్యాపారులు

మునుగోడు : ఆరుకాలం శ్రమిస్తున్న రైతులు పంట చేతికొచ్చాక దగా పడుతున్నారు. పత్తికి మద్దతు ధర దక్కక దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో దళారుల హవా సాగుతోంది. దీంతో రైతులు కేంద్రానికి తీసుకొచ్చిన పత్తికి అనేక కొర్రీలు పెడుతూ కొనుగోలు చేయడం లేదు.. అదే దళారులు తెచ్చిన పత్తికి మాత్రం మద్దతు ధర ఇస్తూ కొనుగోలు చేస్తున్నారు. మునుగోడు ప్రాంత్రంలో నాలుగు సీసీఐ కేంద్రాల్లోనే ఇదే దందా సాగుతోంది. దీంతో తాము పండించిన పంటకు పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.


మద్దతు ధరపై రూ.1200 తగ్గించి కొనుగోలు

మునుగోడు ప్రాంతంలో రైతుల నుంచి పత్తిని ఎక్కువగా దళారులే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.7,180 ఉంటే దళారులు మాత్రం ఆ ధరపై రూ.1200 తగ్గించి కొంటున్నారు. ఇలా మునుగోడు ప్రాంతంలో దాదాపు 15 మంది దళారులు రైతుల నుంచి నిత్యం వందల క్వింటాళ్ల పత్తిని కొంటున్నారు. నిబంధనల ప్రకారం ఏదైనా వ్యాపారం చేసేవారు తప్పని సరిగా మార్కెట్ శాఖ అధికారుల నుంచి అనుమతి పత్రం పొందాలి. కానీ మునుగోడులో పత్తి కొనుగోలు చేస్తున్న వ్యాపారుల్లో ఒక్కరికి కూడా మార్కెట్ శాఖ నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేవు. అంతే కాదు అనుమతులు లేకుండా వ్యాపారం చేసే దళారులు అంతా మార్కెట్ కార్యాలయం పక్కనే అడ్డా ఏర్పాటు చేసుకుని రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

కేంద్రాల నిర్వాహకుల తీరుపై విమర్శలు..

పత్తి కొనుగోలు చేస్తున్న దళారులు సీసీఐ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు పెద్ద మొత్తంలో ముడుపుల ఆశచూపుతున్నట్లు ఆరోపణలు ఉన్నారు. అందువల్లే రైతులు తీసుకెళ్లిన పత్తిని కేంద్రంలో కొనుగోలు చేయకుండా నిరాకరిస్తున్నారని అంటున్నారు. అలా నిరాకరించిన పత్తిని దళారులు క్వింటాకు రూ.6 వేల లోపు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. రైతుల దగ్గర తక్కువ ధరకు కొనుగోలు చేసిన అదే పత్తిని దళారులు సీసీఐ కేంద్రాలకు తీసుకెళ్లి బినామీ పేర్లతో అమ్ముకుని ప్రభుత్వ మద్దతు ధర పొందుతున్నారు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దళారులకే దక్కుతుందని రైతులు వాపోతున్నారు. రైతులను మోసం చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని అనేకమార్లు ప్రజా ప్రతినిధులు, రైతు సంఘాల నేతలు ధర్నాలు చేపట్టినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని దళారును నివారించి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కేలా చూడాలని కోరుతున్నారు.

క్వింటాకు రూ.6 వేలు మాత్రమే ఇచ్చారు.



నాకున్న ఎకరం భూమిలో పత్తి పంట సాగు చేస్తే 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రెండోసారి వచ్చిన 3 క్వింటాళ్లని అమ్ముకునేందుకు సీసీఐ కేంద్రానికి వెళ్తే బాగా లేదని నిరాకరించారు. దానిని స్థానిక వ్యాపారులకు అమ్మాను. మొదట క్వింటాకు రూ.6800 ఇస్తామని చెప్పి.. మూడు రోజుల తర్వాత రూ.6 వేల చొప్పున ఇచ్చారు. అదే పత్తిని వ్యాపారి ఓ వాహనంలో వేసుకొని నీళ్లు చల్లి సీసీఐ కేంద్రంలోనే అమ్మాడు.

– పొడవంగి సైదులు, రైతు, మునుగోడు

దళారులపై చర్యలు తీసుకుంటాం

లైసెన్స్‌లు లేకుండా రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్న దళారులపై వెంటనే చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు దళారులు పత్తి కొనుగోలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. త్వరలో మా సిబ్బంది చేత తనిఖీలు చేయించి లైసెన్స్ తీసుకున్న వారు మాత్రమే పత్తి కొనుగోలు చేసేలా చూస్తాం. సీసీఐ కేంద్రాల్లో రైతులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేయకపోవడం సరికాదు.. ఆ విషయాన్ని కూడా త్వరలో పరిశీలిస్తాం.

– శ్రీకాంత్, జిల్లా మార్కెట్ శాఖ అధికారి

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలు మృతి


కాంతమ్మ (ఫైల్)

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లికి చెందిన బైరబోయిన కాంతమ్మ (100) వయోభారంతో శనివారం తెల్లవారు జామున మృతిచెందింది. మృతురాలికి నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతురాలు కాంతమ్మ ఇప్పటికే తన వంశానికి చెందిన మూడు తరాల వారిని చూసింది. మొన్నటి వరకు ఆరోగ్యంగానే ఉందని మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె స్వయంగా పోస్టాఫీసుకు నడుచుకుంటూ వెళ్లి వృద్ధాప్య పింఛను తెచ్చుకునేదని ఆమె కుమారులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

కొండమల్లేపలి : చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు కొండమల్లేపల్లి సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జేబీ కాలనీలో నివాసముంటున్న రమావత్ పూల్‌సింగ్ ఇంట్లో జనవరి 1న గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.90వేల నగదును అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న దేవరాయ సత్యనారాయణను అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో క్రీస్తు సాక్షాత్కార ఉత్సవాలు

- క్రీస్తు సందేశాన్ని వినిపించిన కార్డినల్ పూల ఆంథోని
- రెండో రోజు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


కేతేపల్లి : వేడుకలో ప్రసంగిస్తున్న కార్డినల్ పూల ఆంథోని

కేతేపల్లి: కేతేపల్లిలోని మేరి జపమాల మాత చర్చిలో క్రీస్తు సాక్షాత్కార (ముగ్గురు రాజుల పండుగ) ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు శనివారం ఉదయం స్థానిక చర్చి ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక చర్చి విచారణ గురువు మాదాను ఫ్రాన్సిస్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు పొరుగు జిల్లాల్లోని వివిధ చర్చిలకు చెందిన 100మంది క్రైస్తవ మత గురువులు, మత కన్యలు, ఏసుక్రీస్తు భక్తులు పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్డినల్ పూల ఆంథోని క్రీస్తు సందేశాన్నిచ్చారు. ప్రజల కోసం తన రక్తాన్ని చిందించిన ఏసు ప్రభువు లోక రక్షకుడని అన్నారు. దేవుడే క్రీస్తు రూపంలో జన్మించి మానవ కల్యాణానికి పాటుపడ్డారని పేర్కొన్నారు. క్రీస్తు సందేశాలు పాటిస్తే శుభాలు కలుగుతాయని అన్నారు. ఏసుక్రీస్తు బోధనలు పాటించి నిర్మల జీవితాన్ని గడపాలన్నారు. పార్థనల అనంతరం క్రైస్తవులకు దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు. వేడుకల్లో జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు పసల శౌరయ్య, చర్చి కమిటీ ప్రతినిధులు పసల ఆరోగ్యయ్య, మాదాను బాలస్వామి, ఆర్లగడ్డ అమర్, జోసఫ్, విజయ్‌రాజు, విజయ్‌కుమార్, పసల దనరాజ్, పాలిశెట్టి జోజప్ప, శౌరి, గుద్దింటి రాయప్ప, క్రైస్తవులు బందా లూబెల్, కాల్వ శౌరయ్య, పసల రవి, జార్జి, అవ్వారి రాయప్ప పాల్గొన్నారు.

జాతరకు భారీగా తరలి వచ్చిన ప్రజలు

ముగ్గురు రాజుల పండుగ సందర్భంగా స్థానిక చర్చిలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏటా చర్చి ఆవరణలో పెద్ద జాతర నడుస్తోంది. చర్చి వెలుపల వెలిసిన పిల్లల ఆటల వస్తువులు, మహిళల అలంకరణ వస్తువులు, తిను బండారాలు, తదితర దుకాణాలతో వీధి కిక్కిరిసి పోయింది. జాతరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు భారీగా తరలివచ్చారు. చర్చిలో ప్రత్యేకంగా నిర్మించిన మేరి మాత విగ్రహం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వేళ మేరి మాత విగ్రహాన్ని, ఏసు శిలువను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ప్రదర్శన నిర్వహించారు.


ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

- భూమి పట్టా మార్పిడి కేసుకు రైతును డబ్బులు డిమాండ్ చేసిన తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్
- ఏసీబీ అధికారులను ఆశ్రయించిన బాధితుడు
- కార్యాలయంలో రాత్రి వరకు అధికారుల సోదాలు
- పలు రికార్డులు స్వాధీనం.. సీనియర్ అసిస్టెంట్‌పై కేసు

నకిరేకల్ : భూమి మార్పిడి కోర్టు కేసు విషయంలో డబ్బులు డిమాండ్ చేసిన నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి 9గంటల వరకు ఏసీబీ అధికారులు తహసీల్దార్ కార్యాయంలో సోదాలు నిర్వహించి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన కొమ్మనబోయిన కిష్టయ్యకు సర్వే నంబర్ 15/2లో ఉన్న రెండు ఎకరాల భూమిని తనకు రాసిచ్చారని, తన పేరిట ధరణిలో పట్టా చేయాలని అదే గ్రామానికి చెందిన కిష్టయ్య అల్లుడు శ్రీనివాస్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులను సంప్రదించాడు. అధికారులు పట్టా మార్పిడి చేయకపోవడంతో శ్రీనివాస్ హైకోర్టును ఆశ్రయించాడు. ఆ భూమిని శ్రీనివాస్ పేరిట పట్టా చేయాలని కోర్టు తీర్పు కూడా ఇచ్చింది. అయితే కోర్టు ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో శ్రీనివాస్ మళ్లీ కోర్టును ఆశ్రయించాడు. ఈ విషయం తెలుసుకున్న కిష్టయ్య కుమారుడు కొమ్మనబోయిన వెంకటేష్ కూడా కోర్టులో కేసు వేశాడు. ఈ క్రమంలోనే ధరణిలో పట్టా చేయాలని కోరుతూ కొద్ది రోజుల క్రితం వెంకటేశ్ నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకన్నను సంప్రదించాడు.


ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్

కోర్టు ఖర్చులకు రూ.65 వేలు కావాలని..

కంటెమ్ట్ కేసు విషయంలో అనుకూలంగా తీర్పు రావాలంటే కోర్టులో కార్యాలయ పరంగా కేసు వేయాల్సి ఉంటుందని సీనియర్ అసిస్టెంట్ వెంకన్న తెలిపాడు. కోర్టు ఖర్చులకు రూ.65వేలు కావాలని వెంకటేశ్‌ను డిమాండ్ చేశాడు. దీంతో సదరు బాధితుడు వెంకటేశ్ ఏసీబీ అధికారులకు వారం క్రితమే ఫిర్యాదు చేయగా అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయంలో పూర్తి ఆధారాలు సేకరించేందుకు నల్లగొండ ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు రామారావుల నేతృత్వంలో అధికారులు శనివారం నకిరేకల్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో సోదాలు చేశారు. సంబంధిత సీనియర్ అసిస్టెంట్ వెంకన్న దగ్గర ఉన్న రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సీనియర్ అసిస్టెంట్ వెంకన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.

బైక్‌ల అపహరణ కేసులో ఇద్దరి అరెస్ట్

కొండమల్లేపలి : బైక్‌ల అపహరణ కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. శనివారం కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్ఐ వీరబాబులు నిందితుల వివరాలు వెల్లడించారు. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన బోడ యాదయ్య బైక్‌ను గత ఏడాది అక్టోబర్ 27న గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు తిప్పర్తి మండలం కాజీరామారం గ్రామానికి చెందిన గంటె కంపు మధుకుమార్, కోదాడకు చెందన కారం శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించారు. వీరు నకిరేకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా మరో బైక్‌ను అపహరించినట్లు విచారణలో ఒప్పుకున్నారు. వారి వద్ద రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు. సమావేశంలో ఏఎస్ఐ ఆంజనేయులు, హేమానాయక్, గురువారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

బస్సును ఢీకొట్టిన లారీ.. ఆరుగురికి గాయాలు

మోతె : లారీ అదుపుతప్పి ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మోతె మండల పరిధిలోని మామిళ్లగూడెం వద్ద శనివారం చోటు చేసుకుంది. ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు వెళ్తోంది. మార్గమధ్యలో మామిళ్లగూడెం వద్ద ముందు వెళ్తున్న డీసీఎం టైరు పగిలిపోయింది. ఈ క్రమంలో బస్సు డ్రైవర్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న లారీ వేగనియంత్రణ కాక వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ అప్రమత్తతో వ్యవహరించి బస్సును రోడ్డు పక్కకు దించడంతో పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

సూర్యాపేట రూరల్ : ప్రజాపాలన దరఖాస్తులను పక్కగా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని సూర్యాపేట జెడ్పీ సీఈఓ సురేష్‌కుమార్ అన్నారు. శనివారం సూర్యాపేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీని పరిశీలించి మాట్లాడారు. తప్పులు దొర్లకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ పరంకుశరావు, ఏపీఓ వెంకన్న, అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

మిర్యాలగూడ : ఎమ్మెల్సీ ఎన్నికకు పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మిర్యాలగూడ ఆర్డీఓ బి.చెన్నయ్య కోరారు. శనివారం స్థానిక తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం నల్లగొండ, ఖమ్మ,ం వరంగల్ నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటరు జాబితా తయారు చేసేందుకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. మండల కేంద్రాల వారీగా డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్, డివిజన్ కేంద్రంలో డీఏఓ, ఆర్డీఓలు సహాయ ఓటు నమోదు అధికారులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో ఓటు నమోదు కోసం దరఖాస్తులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. 1-11-2023 నాటికి మూడు సంవత్సరాలు ముందుగా డిగ్రీ దానికి సమానమైన తత్సమాన, డిప్లొమా, ఇంజనీరింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఓటు నమోదు చేసుకునేందుకు అర్హులని తెలిపారు.ఆయన వెంట డీఏఓ రాధ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కల్పన, సీనియర్ అసిస్టెంట్ జానీషరీఫ్ ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం

నార్కట్‌పల్లి : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నార్కట్‌పల్లి, వేములపల్లి, తిప్పర్తి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన పాల సంఘం మాజీ చైర్మన్ ముద్దం రామచంద్రం తన సోదరుడు అంజయ్యతో కలిసి బైక్‌పై రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో అక్కెనపల్లి గ్రామ శివారుకు వెళ్లగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామచంద్రం అక్కడికక్కడే మృతిచెందగా ఆయన సోదరుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నర్సిరెడ్డి తెలిపారు.

లారీ బోల్తా పడి క్లీనర్ మృతి

వేములపల్లి : లారీ అదుపుతప్పి బోల్తా పడడంతో క్లీనర్ మృతిచెందగా డ్రైవర్, మరో క్లీనర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన వేములపల్లి మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. బేకరీకి సంబంధించిన ముడి పదార్థాలతో ఓ లారీ నెల్లూరు నుంచి ముంబాయికి బయలుదేరింది. మార్గమధ్యలో వేములపల్లి మండల కేంద్రంలోని గంగదేవమ్మ గుడి వద్ద అదుపుతప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన లారీ క్లీనర్ వాన్వె ఆశీశ్‌బాలు (18) అక్కడికక్కడే మృతిచెందగా మరో క్లీనర్ దోత్రె రాహుల్, లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వీరిని తొలుత మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తే కారణమని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు బోల్తాపడిన లారీని క్రేన్ సహాయంతో బయటికి తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.


వేములపల్లి : క్రేన్ సహాయంతో లారీని బయటికి తీయిస్తున్న పోలీసులు

తిప్పర్తిలో కారు డ్రైవర్..

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన శనివారం తిప్పర్తి మండలంలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ పట్టణం బంగారిగడ్డకు చెందిన మహ్మద్ ఆసిఫ్(36) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు నెలల క్రితం తండ్రి మరణించడంతో నిద్ర చేసేందుకు శుక్రవారం తల్లి సుల్తానాను హైదరాబాద్‌లో బంధువుల వద్ద దించేందుకు కారులో వెళ్లాడు. తిరిగి శనివారం మిర్యాలగూడకు వస్తుండగా అనిశెట్టి దుప్పలపల్లి సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన కల్వర్టులో బోల్తా పడింది. స్థానికులు అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా చౌటుప్పల్ వద్ద మృతిచెందాడు. భార్య బీబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.ధర్మా తెలిపారు. మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డే.. 420


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, చిత్రంలో కాంగ్రెస్ నాయకులు

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను 420 అంటున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి.. జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ఆయనే అసలు 420 అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరేశం మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వ నిర్మాణం కోసం తన బీనామిలకు కాంట్రాక్ట్ ఇప్పించుకుని ఆ ప్రాంత ప్రజలకు నీళ్లు ఇవ్వకుండా జగదీష్‌రెడ్డి మోసం చేశారని, ఈ విషయంలో తాను బహిరంగ చర్చకు సిద్ధమని అన్నారు. జిల్లా మంత్రిగా ఉండి నక్కల గండి సొరంగమార్గం పనులు ఒక్క అంగుళం కూడా చేయలేదన్నారు. 'ముసలమ్మ చెట్టు ఎత్తిపోతల పథకాన్ని సంవత్సరం లోపు పూర్తి చేయకుంటే మా మంత్రి జగదీష్‌రెడ్డి రాజీనామా చేస్తాడు' అని నాగార్జునసాగర్ ఉప ఎన్నికలో స్వయంగా అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారని, ఆ పనులు పూర్తికాలేదన్నారు. దానికి బాధ్యత వహిస్తూ జగదీష్‌రెడ్డి రాజీనామా చేయాల్సి ఉండగా.. చేయలేదని, ఇప్పుడు తమ ప్రభుత్వం మీద ఆరోపణలు చేసే అర్హత జగదీష్‌రెడ్డికి ఎక్కడిదని వీరేశం ప్రశ్నించారు. జలహారతి పేరుతో కాళేశ్వరం జలాలు తీసుకవచ్చి సస్యశామలం చేస్తామని చెప్పినా జిల్లాకు చుక్క నీరూ ఇవ్వలేదని ఆరోపించారు. కృష్ణ, గోదావరి, మూసీ నదులను అనుసంధానం చేస్తామని చెసినా దాని ఊసేలేదన్నారు. 'కాంగ్రెస్ హామీలను 420 హామీలు అంటున్న నీవు.. ఆ విషయాలపై ఇద్దరం రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్దాం. నీ మెజారిటీ కంటే ఒక్క ఓటు తక్కువ వచ్చినా నేను ఎన్నిక నుంచి తప్పుకుంటాను' అని వీరేశం సవాల్ విసిరారు. నకిరేకల్ మున్సిపాలిటీలో మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారని, ఆ పనుల్లో కూడా అవినీతి జరిగిందని, కేటీఆర్ కూడా 420 అని ఆరోపించారు. ప్రజల దీవెనలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, నెల రోజుల్లోనే రెండు స్కీంలను అమలు చేశామన్నారు. మిగతా పథకాల కోసం ప్రజా పాలన ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. నిర్మాణాత్మకమైన సూచనలు చేస్తే స్వీకరిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై తప్పుడు విమర్శలు చేస్తే సహించబోమని అన్నారు. విలేకరుల సమావేశంలో చామల శ్రీనివాస్, పూజర్ల శంభయ్య, దైద రవీందర్, పన్నాల రాఘవరెడ్డి, నకిరేకంటి ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

ఆకు కూరల సాగుకు సమయమిదే

- పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ
- తక్కువ సమయంలో పంట చేతికి

పాడి పంట

పెద్దవూర: భారత ఆహార సంస్థ, వైద్య పరిశోధన మండలి సిఫార్సుల మేరకు ప్రతి ఒక్కరూ కనీసం 125 గ్రాముల ఆకు కూరలు ప్రతిరోజు ఆహారంలో తీసుకోవాలి. వీటిలో ఆరోగ్యానికి అవసరమయ్యే పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. విటమిన్ ఏ, సీ, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు అందుతాయి. బావులు, బోర్లు, ఇతర నీటి పారుదల కింద ఆకుకూరల సాగును ఆరుతడి పద్ధతిలో తక్కువ నీటితో సాగు చేపట్టడం ద్వారా అధిక లాభదాయకమని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ సూచిస్తున్నారు. ఈ నెల నుంచి ఆకుకూరల సాగు చేపట్టవచ్చునని తెలిపారు.

సాగు చేయాల్సిన ఆకుకూరలు ఇవే..

పాలకూర, తోటకూర, గోంగూర, చుక్కకూర, మెంతికూర, పుదీన, కొత్తిమీర, బచ్చలికూర ప్రస్తుతం సాగు చేసేందుకు అనుకూలంగా ఉంటాయి. తోటకూరలో ఏఆర్ఎస్‌పి రకం మంచి దిగుబడి వస్తుంది. విత్తిన 15-20 రోజులకే మొదటి కోత వస్తుంది. ఆర్క ఆరుణ, కో-1,2,3 రకాలను సాగు చేయవచ్చు. పాలకూరలో ఆల్‌గ్రీన్ రకం మేలైనది. ఇది విత్తిన 15-20 రోజుల్లోనే కోతకు వస్తుంది. 6 నుంచి 7కోతల్లో ఎకరాకు 50 టన్నుల ఆకు దిగుబడి వస్తుంది. ఆర్క అనుపమ కూడా సాగు చేయవచ్చు. మెంతికూరలో లాంసెలక్షన్-1 రకం గుబురుగా పెరుగుతుంది. ఎక్కువ ఆకు దిగుబడిని ఇస్తుంది. పూసాఎర్లీ బంచింగ్ రకం కూడా తొందరగా కోతకు వస్తుంది. హిస్సార్ సువర్ణరకం కూడా పూసాఎర్లీ బంచింగ్ కంటే 20 శాతం అధిక దిగుబడి వస్తుంది. గోంగూరలో ఏఎన్‌జీఆర్ యా-1 రకం ఎకరాకు 4-5 టన్నుల దిగుబడి వస్తుంది. ఎంఎస్-3 రకం కూడా ఎర్ర గోంగూర రకానికి చెందినదే. దీనిని కూడా తడికింద ఎప్పుడైనా సాగు చేయవచ్చు. కొత్తిమీరలో స్వాతి(సీఎస్-6) పంట కాలం 80-85 రోజులు ఉంటుంది. సాధన (సీఎస్-4) రకం పంటకాలం 100-110 రోజులు ఉంటుంది. ఇది పేనుబంకను తట్టుకుంటుంది. వీటితో పాటు కరివేపాకులో సువాసిని, డిడబ్ల్యూ 1-2 రకాలు, బచ్చలిలో ఎర్ర బచ్చలి, పుదీనాలో స్పియర్‌మింట్ వంటి రకాలు సాగుకు అనుకూలం.

దిగుబడి పెంచడానికి మార్గాలు

తక్కువ కాలపరిమితి, అధిక దిగుబడులు ఇచ్చే రకాలు ఎంపిక చేసుకోవాలి. సమగ్ర ఎరువులు, సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్‌ను ఉపయోగించి విత్తన శుద్ధి చేయాలి. విత్తిన 20 రోజుల నుంచి 15 రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు కలుపు తీసి మట్టిని కదిలించాలి. విత్తే ముందు ఫ్లుక్లోరిలిన్ కలుపు మందును ఎకరాకు 800 గ్రాములు వాడాలి. ఆకు కూరల సాగుకు సాధ్యమైనంత ఎక్కువగా సేంద్రియ ఎరువులను వాడితే నేలలో తేమను ఎక్కువ కాలం పట్టి ఉంచి సూక్ష్మజీవుల చర్యలు అధికమై పోషకాల లభ్యత పెరుగుతుంది. విత్తిన వెంటనే నీరు పెట్టాలి. మరలా మూడోరోజు కూడా నీరు పెట్టాల్సి ఉంటుంది. భూమిలో తేమను బట్టి 5-7 రోజులకు తడి ఇవ్వాలి. విత్తిన మొదటిసారి నీరు పెట్టేటప్పుడు జాగ్రత్తగా నెమ్మదిగా నీరు పెట్టాలి. నీటి ఎద్దడిని తట్టుకోవడానికి రెండు శాతం యూరియా అంటే లీటరు నీటికి 20 గ్రాములు కలిపి చల్లాలి. తోటకూర సాగుకు 800 గ్రాములు, పాలకూరకు 10-12 కిలోలు, గోంగూరకు 6 కిలోలు, మెంతికూరకు 8-10 కిలోలు, కొత్తిమీరకు 4.5 కిలోలు, బచ్చలికూర సాగుకు 5-6 కిలోల విత్తనాలు అవసరం అవుతాయి.


తుంగతుర్తిలో సాగవుతున్న పాలకూర


సాగవుతున్న పుదీనా తోట

విత్తే పద్ధతి..

పాలకూర సాగుకు వరుసల మధ్య 20 సెంటీమీటర్లు, మొక్కల మధ్య దూరం 10సెం.మీ. ఉండాలి. గోంగూరకు వరుసల మధ్య దూరం 30సెం.మీ.లు, మొక్కల మధ్య దూరం 10 సెం.మీ.లు, తోటకూరలో వరుసల మధ్య దూరం 20 సెం.మీ. మెంతికూరలో వరుసల మధ్య దూరం 25 సెం.మీ.లు, మొక్కల మధ్య దూరం 10 సెంటీమీటర్లు, బచ్చలికూరలో వరుసల మధ్య 60 సెం.మీ.లు, మొక్కల మధ్య దూరం 60 సెం.మీ.ల దూరం ఉండాలి.

క్లుప్తంగా

సీఎండీని కలిసిన ఎస్‌పీడీసీఎల్ కాంట్రాక్టర్లు



సీఎండీ ముషారఫ్‌కు మొక్క అందజేస్తున్న ఎస్‌పీడీసీఎల్ కాంట్రాక్టర్లు

నకిరేకల్: టీఎస్ ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌ను శనివారం హైదరాబాద్‌లో ఎస్‌పీడీసీఎల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలిశారు. ఈసందర్భంగా కాంట్రాక్టర్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ బిల్లులను సంక్రాంతి లోపు విడుదల చేయాలని కోరారు. ఆయనను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పారునంది భాస్కర్, కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, కంచర్ల బ్రహ్మాచారి, విమల్ బాయ్, రంజిత్‌రెడ్డి, శంషుద్దీన్, విశ్వేశ్వ రావు, రాజయ్య, వాసు తదితరులున్నారు.

ఇండస్ట్రియల్ పార్క్ రద్దు చేయాలని వినతి



కోదండరాంకు వినతిపత్రం అందజేస్తున్న శివప్రసాద్

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటును రద్దు చేయాలని వెలిమినేడు మండల సాధన సమితి అధ్యక్షుడు పోలగోని శివప్రసాద్ కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఇండస్ట్రియల్ పార్క్ కు ప్రకటించిన భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

మునుగోడు: మండలంలోని చొల్లేడు గ్రామానికి చెందిన ఉడుగుండ్ల శ్రీలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అంత్యక్రియల నిమిత్తం సర్పంచ్ జనిగల మహేశ్వరిసైదులు రూ.10 వేల ఆర్థికసాయాన్ని శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. అంతకు ముందు మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుడిగపాక ఏసు, మాజీ ఎంపీటీసీ బొడ్డు నర్సింహ గౌడ్, ముప్ప వెంకట్ రెడ్డి, కట్కూరి శ్రీను తదితరులున్నారు.

నర్సమ్మకు నివాళి

చిట్యాల: పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జిట్ట చిన్నస్వామి తల్లి నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం చిట్యాలలో నిర్వహించిన దశదిన కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరై ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట జిట్ట భిక్షం, దుర్గేష్, స్వామి, విష్ణు, రాములు, స్వామి, రామలింగం ఉన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, యూటీఎఫ్ నాయకులు

కనగల్: తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం కనగల్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఎంఈఓ తరి రాములు సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పగిళ్ల సైదులు, ప్రభాకర్, వెంకట్‌రెడ్డి, విజయలక్ష్మి, అశోక్, విజయేందర్, ప్రకాష్, వెంకటేశం, లావణ్య, వసంత, కనకయ్య, అరుణ, పద్మ ఉన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం

మర్రిగూడ: ఆరు గ్యారంటీలకు చేసుకున్న దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చేపట్టిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. మర్రిగూడ మండల వ్యాప్తంగా 10,955 కుటుంబాలు ఉండగా 13,285 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ధర్నా

నల్లగొండ టౌన్: గుంటూరులో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగ విద్యార్థుల మహాసభకు అనుమతి లేదంటూ ఏపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరును నిరసిస్తూ శనివారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ఎంఎస్ఎఫ్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో గోడ సునిల్, నాగార్జున, మేడి శంకర్, తుమ్మెదస్వామి, ఇరిగి శ్రీశైలం, బకరం శ్రీనివాస్, యాదయ్య, మోహన్, ఏడుకొండలు, సత్యనారాయణ, తిరుమలేష్, రమేష్, సహదేవుడు, నాగరాజు, కమలమ్మ, జలందర్, నవీన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో అందని 108 సేవలు

- కేతేపల్లి మండలానికి 108 వాహనం కరువు
- సిబ్బందికి వసతి లేదనే కారణంతో సర్వీస్ తొలగింపు
- అత్యవసర సమయాల్లో వేరే మండలాల వాహనాలే దిక్కు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కేతేపల్లి: కేతేపల్లి మండలానికి అత్యవసర సేవలందించే 108 వాహనం కరువైంది. ఆపదలో ఉన్నవాళ్లు 108కి డయల్ చేస్తే సకాలంలో వాహనం వచ్చే పరిస్థితి లేదు. ప్రమాదాలు జరిగినప్పుడు ఇతర ప్రాంతాల నుంచి అంబులెన్స్ ఈ మండలానికి వచ్చేలోపు క్షతగాత్రులు మృత్యువాత పడుతున్నారు. ఇంతకు ముందు ఉన్న 108 సర్వీసును సిబ్బందికి వసతి లేదనే కారణంతో సంబంధిత అధికారులు ఎత్తివేశారు. దీంతో అత్యవసర సమయాల్లో మారుమూల గ్రామాల నుంచి బాధితులను ఆస్పత్రికి తరలించేందుకు వాహనం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఎన్నిసార్లు వినతిపత్రాలు అందించినా..

మండల పరిధిలో 16 గ్రామాలతోపాటు 13కిలోమీటర్ల మేర 65 నంబరు జాతీయ రహదారి విస్తరించి ఉంది. 108 వాహనాలు అందుబాటులోకి వచ్చిన తొలిరోజుల్లో అధికారులు కేతేపల్లి మండలానికి ఒక వాహనం కేటాయించారు. సిబ్బందికి గ్రామ పంచాయతీ కార్యాలయంలోని ఒక గదిని కేటాయించారు. ఏడాది గడిచిన అనంతరం సిబ్బంది ఉండేందుకు ఇక్కడ సరైన వసతి లేదనే కారణంతో అధికారులు వాహనాన్ని మరో చోటుకు తరలించారు. ఏళ్లు గడుస్తున్నా మండలానికి తిరిగి 108 వాహనం కేటాయించలేదు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు మండలవాసులు ఎన్నిసార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయింది.

ఇతర మండలాల నుంచి రావాల్సిందే..

గ్రామాల్లో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు 108కి ఫోన్ చేస్తే నకిరేకల్, సూర్యాపేట మండలాల నుంచి వాహనం వచ్చే వరకు తీవ్ర జాప్యమవుతోంది. ఆయా మండలాల్లో సర్వీసులు బిజీగా ఉంటే జిల్లా కేంద్రం నుంచి రావాలి. ఆయా పట్టణాల నుంచి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లాలంటే సరాసరి 30 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. బాధితులను ఆస్పత్రికి తరలించడానికి సుమారుగా గంటకు పైగా సమయం పడుతుంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో బాధితులను ప్రైవేట్ వాహనాల్లో ఆస్పత్రికి తరలించాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలానికి 108 వాహనం కేటాయించాలని మండల సర్వసభ్య సమావేశాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పలు మార్లు తీర్మానాలు చేసి జిల్లా అధికారులకు పంపించినా వారు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని మండలానికి 108 వాహనం కేటాయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వాహనం కేటాయించాలి



మా మండలానికి 108 అంబులెన్స్ లేదు. కేవలం పక్క మండలాల నుంచి ఇక్కడకు రావాలి. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. 108 వాహనం కేటాయిస్తే ప్రమాద స్థలం నుంచి ఆస్పత్రికి త్వరగా చేరుకునే వీలుంది. స్థానికంగా 108 వాహనం అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– అక్కెనపల్లి సైదులు, కేతేపల్లి

సావిత్రీబాయి స్ఫూర్తిని కొనసాగించాలి



సన్మానం పొందిన మహిళా ఉపాధ్యాయులు

రామగిరి(నల్లగొండ): సావిత్రీబాయి స్ఫూర్తిని నేటి యువత కొనసాగించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఆమె జయంతిని పురస్కరించుకుని తిప్పర్తి బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఈఓ అరుంధతి, యూటీఎఫ్ మహిళా ఉపాధ్యక్షురాలు అరుణ, జిల్లా బాధ్యులు వీరాచారి, మండల అధ్యక్షుడు రమణ, ఆదిమల్ల శ్రీనివాస్, శేఖర్, నరసింహనాయక్, అరుణశ్రీ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలి



ఆర్థిక శాఖ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

రామగిరి(నల్లగొండ): కనీసం వేతనం అమలయ్యేలా ప్రతిపాదనలు పంపాలని సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు కోరారు. శనివారం హైదరాబాద్‌లో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కలిసి తమ సమస్యలు వివరించారు. పెండింగ్‌లో ఉన్న నవంబర్, డిసెంబర్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. ఆయనను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగుల కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరందాసు సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షుడు పాడ్యా నాగేశ్వరరావు, మొగిలిచెర్ల శ్రీనివాస్, రవీందర్, సేన్యా నాయక్ ఉన్నారు.

ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



వల్లాలలో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం: రాష్ట్రంలో ప్రజలకిచ్చిన మాటకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం మండలంలోని వల్లాలలో శనివారం పలు అభివృద్ధి పనులు ఆయన ప్రారంభించారు. ఊట్కూరు, ఇటుకులపహాడ్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలనలో పాల్గొన్నారు. వల్లాలలో శ్రీపార్వతిశంభులింగేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రూ.50లక్షల వ్యయంతో నిర్మించనున్న దేవాలయ ముఖద్వార రాజగోపుర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన తరగతి గదిని ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మించనున్న ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎర్ర రణీల, సర్పంచ్‌లు షేక్ ఇంతియాజ్, వేముల లింగయ్య, అల్లి సైదులు, వల్లాల ఎంపీటీసి మాదగోని కవిత, నకిరేకల్ ఏడిఏ శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ సుధాకర్, ఏఓ సౌమ్యశృతి, పీఆర్ ఏఈ భరత్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీఓపై ఎమ్మెల్యే ఆగ్రహం

ఊట్కూరు గ్రామంలో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయకపోవడం, కుర్చీలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండటాన్ని ఎమ్మెల్యే గమనించారు. వసతులు కల్పించకపోవడంతో ఎంపీడీఓ లక్ష్మయ్యపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రతి ఇంటిలో ఐదు దీపాలు వెలిగించాలి



అక్షింతల పంపిణీలో పాల్గొన్న నర్సయ్య గౌడ్

మునుగోడు: అయోధ్యలోని రామ మందిరం ఈ నెల 22న ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రతి ఇంటిలో ఐదు దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు చేయాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ కోరారు. మునుగోడు మండలంలోని గూడపూర్ గ్రామంలో శనివారం అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం బీజేపీ కార్యకర్తలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. కేంద్రం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి పార్టీ బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కంచి జ్యోతి, బీజేపీ జిల్లా కార్యదర్శి దర్శనం వేణు, బొడ్డు నాగరాజు గౌడ్, కంభంపాటి నర్సింహ, దేశిడి వెంకన్న, నన్నూరి భూపతిరెడ్డి, ఉప సర్పంచ్ దేశిడి శ్రీనివాస్ గౌడ్, దైద మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఆదరించండి

మర్రిగూడ: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కోరారు. శనివారం మర్రిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శివన్నగూడ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లు మంజూరు చేయిస్తామని తెలిపారు. సమావేశంలో పంగ యాదయ్య, గ్యార రామలింగం, నర్ర పరమేష్, జిల్లా కిశోర్, శివ, యాదయ్య, పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరాముడి అక్షింతల పంపిణీ

చిట్యాల: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి తీసుకువచ్చిన అక్షింతలకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తీర్థక్షేత్ర ట్రస్ట్ నార్కట్‌పల్లి ఖండ వ్యవస్థ విభాగ్ మైల సత్తయ్య, సంపర్క వ్యవస్థ విభాగ్ మర్రి హరీష్‌రెడ్డి, సర్పంచ్ మర్రి జలందర్ రెడ్డి, ఎంపీటీసీ ముద్దసాని నీతా రమణారెడ్డి, ఉపసర్పంచ్ నూతి సత్యశ్రీ వెంకటేశం, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, తెల్సూరి సైదులు, సాగర్ల నాగరాజు, నారాయణ మధుసూదన్, లింగస్వామి, నరేష్, నర్సింహ, నాగచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మర్రిగూడ: మండలంలోని దామెరభీమనపల్లి, లెంకలపల్లి, తానేదారుపల్లి గ్రామాల్లో శనివారం అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మునగాల వెంకటేశ్వర్‌రావు, చాపల మల్లయ్య, వెంకన్న, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖచారికి నివాళి



శ్రీరామోజు షణ్ముఖ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్: బీజేపీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన వ్యక్తి శ్రీ రామోజీ షణ్ముఖచారి అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొంగిడి మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని బండారు గార్డెన్‌లో ఆ పార్టీ ఆధ్వర్యంలో షణ్ముఖచారి సంతాప సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, నూకల నరసింహారెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, గార్లపాటి జితేంద్ర కుమార్, రాష్ట్ర నాయకులు ఎర్రమల్ల భాస్కర్, రాజయ్య, గుండగోని నాగయ్య, సురిగి మారయ్య, నన్నూరి రాంరెడ్డి, గార్లపాటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

శాలిగౌరారం: మండల కేంద్రంలో శనివారం టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహ్మద్ రఫీ, ఉపాధ్యక్షులుగా దేవయాని, నల్ల చక్రపాణి, ప్రధాన కార్యదర్శిగా పుణ్యమూర్తి జయసాగర్, ఆర్థిక కార్యదర్శిగా అల్లం శంకర్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా కడేరు రవి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాకేశ్, రాములు, యశోద, శ్రీనివాసులు, ఆంజనేయులు, శకుంతల, మానస, సృజన, రామకృష్ణారెడ్డి, సైదులు, యాదగిరి, శ్రీహరి, శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రంగవల్లులు

నల్లగొండ: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నల్లగొండలోని చర్లపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో శనివారం లయన్స్ క్లబ్ నల్లగొండ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు మహిళా చైతన్యం, అన్ని రంగాల్లో మహిళల పాత్ర, దేశ సంస్కృతి, సంప్రదాయాలపై ముగ్గులు వేశారు. అఖిల, మానసలకు ప్రథమ బహుమతిగా రూ.2000, ద్వితీయ బహుమతి కింద దుర్గా, కరుణలకు రూ.1500, తృతీయ బహుమతిగా శృతి, కావేరీలకు రూ.1000, ప్రోత్సాహక బహుమతి కింద రూ. 500 లిఖిత, పల్లవి పొందారు. విజేతలకు రిపబ్లిక్ డే సందర్భంగా బహుమతులను అందజేయనున్నట్లు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. కాగా.. న్యాయ నిర్ణేతలుగా ఇందిరా రాణి, జెల్లా సరళ, ఇందిర వ్యవహరించారు. పోటీలను ఎన్ఎస్ఎస్ యూనిట్స్, పీఓలు అపర్ణ, మనెమ్మ నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నల్లగొండ ట్రెజరర్ వీరవెల్లి సత్యనారాయణ, నిమ్మల పిచ్చయ్య, మండది నర్సిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ షేక్ సుల్తానా, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.హిమజ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ముగ్గులు వేస్తున్న విద్యార్థులు



ముగ్గులు పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు ఇందిరా రాణి, జెల్లా సరళ, ఇందిర

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నకిరేకల్: నర్సింహాపురంలో దరఖాస్తులు తీసుకుంటున్న ఎమ్మెల్యే వీరేశం, అధికారులు

నకిరేకల్: పేదరిక నిర్మూలనే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం నకిరేకల్ మండలంలోని నర్సింహాపురం గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు, తహసీల్దార్ ప్రసాద్ నాయక్, ఎంపీడీఓ రమేష్ దీన్ దయాళ్, సర్పంచ్ మాలే పవన్‌రెడ్డి, ఎంపీటీసీ దాసరి వీరార్జున్‌రెడ్డి, నాయకులు నకిరేకంటి ఏసుపాదం, గాదగోని కొండయ్య పాల్గొన్నారు. అదేవిధంగా మండలాపురంలో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం

నార్కట్‌పల్లి: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం నార్కట్‌పల్లి మండలంలోని చిప్పలపల్లి, మాండ్ర, తొండల్‌వాయి గ్రామాల్లో ప్రజాపాలన నిర్వహించారు. ఈసందర్భంగా మాండ్ర, తొండల్‌వాయి గ్రామాల్లో ఎమ్మెల్యే దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకయ్య, ఎంపీడీఓ యాదగిరి, తహసీల్దార్ పద్మ, సూపరింటెండెంట్ ప్రదీప్, మోహన్, గిరిప్రసాద్, ఆర్ఐ తరుణ్, సర్పంచ్‌లు కొండయ్య, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

అభయహస్తం ద్వారా ఆరు గ్యారంటీలు

కేతేపల్లి: ప్రభుత్వం అభయహస్తం ద్వారా అర్హులందరికీ ఆరు గ్యారంటీలను అందిస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, కేతేపల్లి ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కోట మల్లికార్జునరావు, సర్పంచ్ కోట వెంకటేశ్వరావు, కేతేపల్లి సర్పంచ్ జటంగి ముత్తమ్మ, ఎంపీటీసీ దాచేపల్లి నర్మదనాగేశ్వర్‌రావు, డీసీసీ కార్యదర్శి కోట పుల్లయ్య పాల్గొన్నారు.

ముగిసిన ప్రజాపాలన

నల్లగొండ టూటౌన్: ఆరు గ్యారంటీ పథకాల అమలుకు చేపట్టిన ప్రజాపాలన శనివారం ముగిసింది. చివరి రోజు నల్లగొండలో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణలో మున్సిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ముసాబ్ అహ్మద్, ఏసీపీ నాగిరెడ్డి, ఈఈ రాములు, ఇతర అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

18,500 దరఖాస్తుల స్వీకరణ

నల్లగొండరూరల్: ప్రజాపాలనలో భాగంగా శనివారం మండలంలో 18,500 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. చెన్నారంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్ ఉప్పునూతల వెంకన్నయాదవ్, కార్యదర్శి సరిత యాదవ్ పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

చిట్యాల: మండలంలోని సుంకేనేపల్లి గ్రామంలో శనివారం ప్రజాపాలన దరఖాస్తులను చిట్యాల తహసీల్దార్ దశరథ స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కక్కిరేణి బొందయ్య, ఉపసర్పంచ్ బాతరాజు రవీందర్, ఎంపీఓ పద్మ, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆవుల యాదయ్య పాల్గొన్నారు.

చివరిరోజు 13,978 దరఖాస్తులు

చండూరు: చండూరు, గట్టుప్పల్ మండలాల్లో శనివారం ప్రజాపాలన గ్రామ సభలు ముగిసాయి. చివరిరోజు 13,978 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సోమవారం నుంచి వీటిని ఆన్‌లైన్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన ప్రజాపాలన గ్రామసభలు

మునుగోడు: ఆరు గ్యారంటీల అమలు కోసం గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలు శనివారం ముగిసాయి. చివరి రోజు మునుగోడు, జక్కలవారిగూడెంలో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, ఎంపీడీఓ భాస్కర్ గౌడ్, తహసీల్దార్ నరేందర్, సర్పంచ్‌లు మిర్యాల వెంకన్న, జక్కలి శ్రీను, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కనగల్: మండలంలోని చర్లగౌరారం, కనగల్, శాబ్దుల్లాపురం గ్రామాల్లో శనివారం నిర్వహించిన ప్రజాపాలనలో జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్ దరఖాస్తులు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, సర్పంచ్ నర్సింగ్ సునిత, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్, సర్పంచ్‌లు దాసిరెడ్డి జ్యోతిరవీందర్‌రెడ్డి, చింతల యాదగిరి, మాజీ కో ఆప్షన్ హఫీజ్, ఉపసర్పంచ్ కారింగు శ్రీకాంత్, నర్సింగ్ మురళీధర్ తదితరులున్నారు.

ఇస్మాయిల్‌పల్లిలో ప్రజాపాలన

కట్టంగూర్: మండలంలోని ఇస్మాయిల్‌పల్లి గ్రామంలో శనివారం ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య అధికారులతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు సుంకర బోయిన నర్సింహ, మాద యాదగిరి, సర్పంచ్ పులిగిల్ల అంజయ్య, ఎంపీడీఓ సునిత, ఎంపీఓ అథర్ ఫర్వేజ్, ఎంపీటీసీ పాలడుగు హరికృష్ణ, ఏపీఎం వినోద, రేకల శ్రీను, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లిలో 12,774 దరఖాస్తులు

కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని 16 గ్రామాల్లో శనివారం నిర్వహించిన గ్రామసభల ద్వారా 12,774 దరఖాస్తులు స్వీకరించినట్లు కేతేపల్లి ఎంపీడీఓ హరికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత డిసెంబర్ 28 నుంచి.. ఈనెల 6వ తేదీ వరకు మండల కేంద్రమైన కేతేపల్లిలో 1,533, బండపాలెం 307, చీకటిగూడెం 518, భీమారం 1151, ఇనుపాముల 1,210, కొండకిందిగూడెం 434, కొప్పోలులో 853, ఉప్పలపహాడ్ 380, చెర్కుపల్లి 1136, తుంగతుర్తి 980, బొప్పారం 531, గుడివాడ 1287, ఇప్పలగూడెం 316, కాసనగోడు 632, కొత్తపేట 813, కొర్లపహాడ్‌లో 693 దరఖాస్తులు స్వీకరించామని పేర్కొన్నారు.



మునుగోడు: ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్వామి




నల్లగొండ టూటౌన్: 48వ వార్డులో దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు



కట్టంగూర్: ఇస్మాయిల్‌పల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య

ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేయాలి

మర్రిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాలను వంద రోజుల్లో అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. శనివారం మర్రిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో భూమిలేని నిరుపేదలను గుర్తించి వారికి ప్రభుత్వ భూములు అందించాలన్నారు. శివన్నగూడ ప్రాజెక్టులో ముంపు బాధితులకు నష్ట పరిహారం అందించి, పనులు పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు కొట్టం యాదయ్య, ఉప్పునూతల వెంకటయ్య, మైల సత్తయ్య, గిరి వెంకటయ్య, నీలకంఠ యాదయ్య, ఎడ్ల అంజయ్య, మాడుగుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏర్పుల యాదయ్య

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- ఎమ్మెల్యే వేముల వీరేశం



నకిరేకల్: ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కౌన్సిలర్లు

కేతేపల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.బాలమ్మ, ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, సర్పంచ్ కోట వెంకటేశ్వరావు, ఎంపీటీసీ దాచేపల్లి నర్మదనాగేశ్వరావు, మాజీ జెడ్పీటీసీ కోట మల్లికార్జునరావు, కోట పుల్లయ్య, కోట పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

నకిరేకల్: నకిరేకల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు చెందిన 12, 14 వార్డు కౌన్సిలర్లు బానోతు వెంకన్న, గడ్డం లక్ష్మీనర్సింహస్వామి శనివారం స్థానికంగా ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కనగల్: మండల పరిధిలోని జి.యడవల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు నకిరేకంటి యాదయ్య శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని శనివారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బండారు ప్రసాద్ పరామర్శించి, మృతదేహానికి నివాళులర్పించారు. వారి వెంట ఆ పార్టీ మండలాధ్యక్షుడు పులకరం భిక్షం, భిక్షపతి, కాడింగు ముత్యం, ఓర్సు శ్రీను, జిల్లా శేఖర్, శివాజీ, మోహన్‌బాబు, సురేందర్, భిక్షమాచారి, శంకర్, రమేష్, కిరణ్ తదితరులున్నారు.